మీరే నేరుగా..

ఆంధ్రజ్యోతి వారధిగా..!

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం చొరవ
- నేడు అనంతపురం ఆదర్శ నగర్‌లో కార్యక్రమం
- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్య అతిథి



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని 32వ డివిజన్‌లో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం మంగళవారం జరగనుంది. ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ స్కేటింగ్ మైదానంలో ఉదయం 8 గంటలకు సమావేశం మొదలౌతుంది. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున రెడ్డి, టూటౌన్ సీఐ శ్రీకాంత్, కార్పొరేటర్ కమల్ భూషణ్, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, డివిజన్‌లోని ముఖ్య నాయకులు, ప్రజలు హాజరవుతారు.

నగరపాలక సంస్థ పరిధిలోని 32వ డివిజన్ పరిధిలో విద్యుత్ నగర్, ఆదర్శనగర్, ఓబుళదేవ్ నగర్, లక్ష్మీనరసయ్య కాలనీలో కొంతభాగం, సెవెన్ హిల్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ ఉన్నాయి. దాదాపు 1500 ఇళ్లు, 6,250 మంది ఓటర్లు ఉన్నారు. పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా వారానికి ఒకసారి మాత్రమే ఇక్కడ చెత్త సేకరణ జరుగుతోంది. దీంతో ఇళ్లలోని చెత్త వీధుల్లోకి, డ్రైనేజీ కాలువల్లోకి చేరుతోంది. వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు పెరిగి, విష పురుగులు చేరుకుంటున్నాయి. సీసీ రోడ్లు లేవు. ఇలాంటి ఎన్నో సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి నేరుగా ప్రజలే తీసుకెళ్లేలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసింది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం

రికార్డులను వైసీపీవారికి

ఎలా ఇస్తారు..?

జేడీపై గొర్రెల పెంపకం సొసైటీ సభ్యుల ఆగ్రహం



నిరసన వ్యక్తం చేస్తున్న సొసైటీ సభ్యులు

అనంతపురం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల సంఘం పాత రికార్డులను వైసీపీవారికి ఎలా అప్పగిస్తారని ఆత్మకూరు మండలం మదిగుబ్బ గొర్రెల పెంపకం దారుల సంఘం సభ్యులు నిలదీశారు. పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. కార్యాలయంలోకి వెళ్లి అధికారులను నిలదీశారు. తక్షణమే రికార్డులను తెప్పించాలని డిమాండ్ చేశారు. దీంతో దాదాపు గంటపాటు ఉద్రిక్తత కొనసాగింది. ఆందోళన చేస్తున్నవారిని జేడీ వెంకటస్వామి తన చాంబర్‌లోకి పిలిపించుకుని మాట్లాడారు. మదిగుబ్బ సొసైటీ ఎన్నికలు వాయిదా పడ్డాయని, స్థానిక వెటర్నరీ డాక్టరు తమ కార్యాలయంలో రికార్డులను అప్పగించారని సంఘం సభ్యులు అన్నారు. ఆ రికార్డును పాత కమిటీకి తిరిగి ఎలా అప్పగిస్తారని నిలదీశారు. వెంటనే రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రికార్డులను స్వాధీనం చేసుకుంటామని జేడీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సంఘంలోని టీడీపీ వర్గీయులు నరసింహులు, భాస్కర్ నాయక్, గోపాల్, అక్కులన్న, బొమ్మయ్య, పోతన్న, ఆనంద్, నాగరాజు, చితంబరి పాల్గొన్నారు.


పెట్రోల్ సబ్సిడీ దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శారీరక దివ్యాంగులు తమ మూడు చక్రాల వాహనాలకు వాడే పెట్రోల్‌కు సంబంధించి సబ్సిడీ దరఖాస్తు గడువును పొడిగించినట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సొంత వ్యాపారాలు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులు మూడు చక్రాల వాహనాలు కలిగి ఉన్న శారీరక దివ్యాంగులకు పెట్రోల్‌కు 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నెలలో ఎంత పెట్రోల్ వాడుతారో దానికి సంబంధించి 50 శాతం సబ్సిడీని నగదుగా అందజేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు సదరం సర్టిఫికెట్, పెట్రోల్ బిల్లులు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదట పేజీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు 3, మూడు చక్రాల వాహనం ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు పత్రాలతో పాటు వ్యాపారం, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఈ నెల 21 చివరి తేదీగా నిర్ణయించగా... ప్రస్తుతం ఈ నెల 31 వరకూ గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 08554-232380కు సంప్రదించాలన్నారు.

బలిపీఠంపై..

బాలల హక్కులు

- విద్యాసంస్థలలో ఫీజులు, చదువుల ఒత్తిళ్లు
- భరించలేక.. భావిపౌరుల బలవన్మరణాలు
- చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం



కరువు రక్కసి కోరల్లో నలుగుతున్న జిల్లా ప్రజలు.. తమ బడ్డల ఉన్నతికోసం 'చదువుల యజ్ఞం' ప్రారంభించారు. తమ బిడ్డలకు ఈ కష్టాలు ఉండకూడదని తపిస్తున్నారు. ఈ క్రమంలో ఎంత కష్టమైన భరించి, దొరికినచోటల్లా అప్పులు చేసి చదివిస్తున్నారు. ఇదే అదనుగా విద్యావ్యాపార సంస్థలు కొన్ని దోపిడీకి తెరతీశాయి. వసూళ్ల వేటలోపడి.. మానసిక హింసకు దిగుతున్నాయి. భరించేవారు బయట పడుతుండగా.. భరించలేనివారు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. నియంత్రించాల్సిన వ్యవస్థలు ఏమాత్రం స్పందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనంతపురం విద్య, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చదువులలో కార్పొరేట్లు ప్రవేశించాక వ్యాపార ధోరణి పెరిగింది. లాభాపేక్షతో విచక్షణ, మానవీయతో కోల్పోతున్నారు. చాలా కాలేజీలలో ఫీజుల వసూళ్లకు రౌడీలకు ఏమాత్రం తీసిపోని సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరు భౌతికంగా దాడి చేయరుగానీ, మానసికంగా అంతకు మించిన దాడులు చేస్తారు. వారితీరు కారణంగా విద్యార్థుల బలవన్మరణాలు చోటు చేసుకుంటున్నాయి. వీరితీరుతో ఇళ్లకు దూరంగా.. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఉంటున్న బాలబాలికలు నలిగిపోతున్నారు. చదువుల ఒత్తిడి, ఫీజుల వేధింపులను బాలలు భరించలేకున్నారు. విద్యాసంస్థల నిర్వహణకు డబ్బులు అవసరమే అయినా.. వసూళ్లకు పరిమిత లేకుండాపోయింది. వసూళ్ల ప్రక్రియలో హింస పెడుతున్నారు. విద్యాసంస్థల ప్రధాన ద్వారాలలో 'టోల్ గేట్లు' ఏర్పాటు చేస్తున్నారు. 'డబ్బు కట్టి దాటు..' అంటున్నారు. తరగతి గదుల్లోనూ నిలబెడుతున్నారు. ఇది విద్యార్థుల లేత హృదయాలను గాయపరుస్తోంది.

గర్భస్థ శిశువే నయం

విద్యార్థులతో పోలిస్తే.. గర్భస్థ శిశువుకు, పురిటి బిడ్డ పరిస్థితే నయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి విషయంలో చట్టాలను కొంత మెరుగ్గానే అమలు చేస్తున్నాయి. వారి ఆరోగ్యం, ఎదుగుదలకు ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నాయి. శిశు మరణాలు సంభవించినా, భ్రూణ హత్యలు జరిగినా అధికారులు స్పందిస్తున్నారు. ఆసుపత్రులు, వైద్యులు, సిబ్బందిపై అప్పుడప్పుడైనా చర్యలు తీసుకుంటున్నారు. కానీ విద్యార్థులకు ఏం జరిగినా కనీస స్పందన లేదు. పసివారిని నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తున్నా వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తున్నాయి. నవ్వుతూ, తుళ్లుతూ.. చదువుతూ.. ఎదుగుతూ ఉండాల్సిన బిడ్డ.. ఎత్తైన భవంతుల నుంచి అమాంతం దూకేస్తుంటే.. నాలుగు గోడల నడుమ ఉరి తాడుకు వేలాడుతుంటే.. ఎవరికీ పట్టకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ఇంటర్ విద్యార్థులే ఎక్కువ..!

విద్యార్థుల బలవన్మరణాలు ఇంటర్ స్థాయిలోనే ఎక్కువగా జరుగుతున్నాయి. జరిగిన సంఘటనలను పరిశీలిస్తే.. ఫీజులు, చదువుల ఒత్తిడి దీనికి ప్రధాన కారణమని స్పష్టంగా అర్థమవుతుంది. మరీ ముఖ్యంగా.. 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. బాల్యం, యవ్వన దశలకు మధ్యలో ఉన్న వీరు.. అవమానాలను, ఒత్తిళ్లను అంత సులువుగా జీర్ణించుకోలేరు. ఇదే ఆత్మహత్యలకు దారితీస్తోంది. కాలేజీలలో చేర్పించే సమయంలోనే ఫీజుల గురించి తమ బిడ్డల వద్ద ప్రస్తావించవద్దని, ఏదైనా ఉంటే తమతో నేరుగా మాట్లాడాలని తల్లిదండ్రులు స్పష్టంగా చెప్పాలి. విద్యాశాఖ, జిల్లా అధికార యంత్రాంగం సైతం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. విద్యార్థుల వద్ద డబ్బు ప్రస్తావన తీసుకురాకుండా చర్యలు చేపట్టాలి. 'ఫీజు ఎంత..? ఎప్పటిలోగా చెల్లించాలి..?' అనే అంశంలో పారదర్శకత ఉండేలా చూడాలి.

వ్యవస్థల్లో మార్పు రావాలి..

విద్యార్థుల బలవణ్మరణాలు ఇప్పటివి కావు. కార్పొరేట్ కాలేజీలు మొదలైనప్పటి నుంచే జరుగుతున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా వాటిపై చర్యలు తీసుకోవడం లేదు. ఆర్‌ఐఓ దేనా బాధ్యత..? ఇంటర్ బోర్డు కార్యదర్శికి సంబంధం ఉండదా..? ఆయనదీ బాధ్యతేగా..? విద్యా వ్యాపారంలో విద్య లేదు.. వ్యాపారమే సాగుతోంది. ఎక్కడా ల్యాబ్స్ కనిపించవు. గతంలో ఎంసెట్, ఇప్పుడు నీట్, జేఈఈ అంటూ పరుగులు పెట్టిస్తున్నారు. ఫీజుల వేధింపులు వర్ణనాతీతం. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై పోలీసులు సరైన కేసులు పెట్టరు. లోతైన దర్యాప్తు ఉండదు. కొందరు నిర్లజ్జగా వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. వ్యవస్థల్లో మార్పు వస్తేనే కొంతైనా ఆపగలం.



- చంద్రశేఖర్,
మానవ హక్కుల వేదిక కార్యకర్త

స్వతంత్ర కమిటీని నియమించాలి..

కార్పొరేట్ కళాశాలలో డొనేషన్లు, అదనపు రుసుముల పేరుతో దోపిడీ, వేధింపులు అధికమయ్యాయి. సకాలంలో డబ్బులు చెల్లించకపోతే క్లాస్ నుంచి బయటకు పంపుతున్నారు. నిలబెట్టి అవమానిస్తున్నారు. ఎక్కడో ఒక చోట ఈ ఘోరాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సుమోటోగా కేసులు నమోదు చేయాలి. విద్యారంగంలో చట్టాల అమలు కఠినతరం చేయాలి. ప్రతి జిల్లాలో విద్యావ్యవస్థను పర్యవేక్షించే స్వతంత్ర కమిటీని నియమించాలి. ఈ కమిటీలే కాలేజీల్లో వేధింపులపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేలా కృషి చేయాలి.



-సూర్యచంద్ర యాదవ్,
అడ్వకేట్, ఏఐఎల్‌యూ రాష్ట్ర నాయకుడు

చట్టాలు ఉన్నాయ్..!

విద్యారంగాన్ని ఒక సేవగా పరిగణించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్-2019 కింద అనేక చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆర్థిక వేధింపులతో విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టినవారిపై వినియోగదారుల హక్కుల చట్టం కింద కోర్టుల ద్వారా కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)-2009 కింద విద్యార్థులకు సమానమైన, వేధింపుల రహిత వాతావరణం కల్పించడం విద్యాసంస్థల ప్రధాన బాధ్యత. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే.. 'నేరపూరిత చర్యలు'గా భావించి.. యాజమాన్యంపై తీసుకోచ్చు. విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించేలా వేధించినా, ఒత్తిడి చేసినా.. నేరమే. మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్ -2017 కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవచ్చు. ఈ చట్టాలన్నీ విద్యార్థులకు రక్షణగా నిలుస్తున్నాయి. కానీ అమలు చేసే దిశగా ఇంటర్ బోర్డు అధికారులుగాని, జిల్లా యంత్రాంగంగాని చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా సంఘటన జరిగితే 'వెళ్లామా.. చూశామా.. వచ్చామా..' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే విద్యార్థులకు శాపంగా మారుతోంది.

ఇవీ.. గణాంకాలు..	
మొత్తం జూనియర్ కళాశాలు	176
ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు	88
మొదటి సంవత్సరం విద్యార్థులు	26,351
రెండో సంవత్సరం విద్యార్థులు	21,050
టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్	15,042

ఇతర చట్టాలూ వర్తిస్తాయి..

విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన యాజమాన్యాలపై చట్ట ప్రకారం అనేక కేసులు నమోదు చేయవచ్చు. సుమోటోగా కూడా కేసులు పెట్టవచ్చని న్యాయ నిపుణులు, సోషల్ యాక్టివిస్టులు చెబుతున్నారు. విద్యార్థులను ఆత్మహత్యలకు ప్రేరేపించడం సెక్షన్ 305, 306 కింద నేరం. 'అబెట్మెంట్ టు సూసైడ్' కింద కేసు నమోదు వచ్చేవచ్చు. శారీరక వేధింపులకు పాల్పడితే 323, 324 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేయవచ్చు. అవమానకర వ్యాఖ్యలు చేసినా, మానసిక వేధింపులకు గురి చేసినా సెక్షన్ 509 కింద కేసు నమోదు చేయవచ్చు.

యువగళం.. రాజకీయాలను మార్చేసింది

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

టీడీపీ జిల్లా కార్యాలయంలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జగన్ అరాచకాలకు వ్యతిరేకంగా నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలను మార్చేసిందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. యువగళం పాదయాత్ర పూర్తై రెండేళ్లు గడిచిన సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తదితరులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అరాచక పాలనను అంతం చేసేందుకు యువగళం పేరుతో నారా లోకేశ్ ముందుకొచ్చారని అన్నారు. ఆ రోజు పాదయాత్రకు అనేక ఇబ్బందులు కలిగించారని అన్నారు. మాట్లాడేందుకు వేదికలను కూడా ఏర్పాటు చేయనివ్వలేదని, అయినా నారా లోకేశ్ ముందడుగు వేశారని అన్నారు. లోకేశ్ పాదయాత్రతోనే టీడీపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. నారా లోకేశ్ యువగళంతో వైసీపీ అరాచకపాలన తుడిచిపెట్టుకుపోయిందని వెంకటశివుడు యాదవ్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, ముంటిమడుగు కేశవరెడ్డి, గంగారామ్, మాజీ మేయర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి: ఎస్పీ



వాకథాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ జగదీష్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం వాకథాన్ నిర్వహించారు. కేఎస్ఆర్ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు నడక సాగించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ద్విచక్రవాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే సమయంలో సేఫ్టీ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని జేసీ శివనారాయణ శర్మ అన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు వాకథాన్ నిర్వహించామని డీటీసీ వీర్రాజు తెలిపారు. అనంతపురం ఆర్టీఓ సురేష్ నాయుడు, రాయదుర్గం ఆర్టీఓ రమేష్, కేఎస్ఆర్, జేఎన్‌టీయూ ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఈఎస్ రామమోహన్ రెడ్డి

అనంతపురం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్లు గీత కార్మికులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి 5వతేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం షాపులను కల్లుగీత కార్మికుల గౌడ, ఈడిగ, కళాలి వర్గీయులకు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

వేధింపులకు మహిళ బలి


మీనాక్షి (ఫైల్)

యల్లనూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగవరం గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక మీనాక్షి (32) ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసగౌడ్ తెలిపారు. శింగవరం గ్రామానికి చెందిన మీనాక్షి ఇదే గ్రామానికి చెందిన జయప్రకాష్‌ను 14 ఏళ్ల కిందట ప్రేమించి వివాహం చేసుకుంది. ఇటీవల కొద్దిరోజుల నుంచి కుటుంబంలో కలహాలు మొదల య్యాయి. అనుమానంతోపాటు కట్నం తేవాలని భర్త, ఆడబిడ్డ భర్త శివశంకర్ తరచూ మీనాక్షిని వేధించేవారు. వీటిని తాళలేక జీవితంపై విరక్తి చెందిన ఆమె ఇంటిలో అందరూ నిద్రపోతున్న సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పొలాల్లో దొంగలు

- ఆదివారం రాత్రి వరుసగా కేబుల్‌వైర్‌ల చోరీ


జగదీష్ తోటలో కేబుల్‌వైరు కట్ చేసుకొని వెళ్లిన దృశ్యం

యాడికి, జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు గ్రామం వద్ద ఆదివారం రాత్రి పది మంది రైతుల బోరుబావులకు సంబంధించిన కేబుల్‌వైరు ఎత్తుకెళ్లారు. రాయలచెరువుకు చెందిన రైతులు జగదీష్, శ్రీనివాసులు, వాసుదేవ తెలిపిన మేరకు.. రాత్రి 7గంటల సమయంలో తోటల వద్దకు వెళ్లి నీటిపారకం చూసుకొని వచ్చామన్నారు. తోటల వద్దకు సోమవారం ఉదయం వెళ్లి చూస్తే బోరుబావుల వద్ద కేబుల్‌వైరు కట్ చేసుకొని వెళ్లినట్లు గమనించామని తెలిపారు. జగదీశ్‌కు చెందిన మూడుబోరుబావుల కేబుల్‌వైరు, శ్రీనివాసులుకు చెందిన ఒక బోరుబావి కేబుల్‌వైరు, వాసుదేవకు చెందిన ఒక బోరుబావి కేబుల్‌వైరును దుండుగులు కత్తిరించుకు వెళ్లినట్లు తెలిపారు. సమీపంలోని మరికొందరు రైతుల బోరుబావుల కేబుల్‌వైర్లను కట్ చేసుకొని వెళ్లారని తెలిపారు. పోలీసులు కేబుల్‌వైర్ చోరీలను అరికట్టకపోతే రైతులు బోరుబావుల కిందపంటలు సాగుచేయడం కష్టమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ వర్గీయుడి దౌర్జన్యం

- ఆశా వర్కర్‌పై కట్టెతో దాడి
- చేయి విరగడంతో ఆస్పత్రిపాలు
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు


తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి

ధర్మవరంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామంలో వైసీపీ వర్గీయుడు పెద్ద ఫక్కీరప్ప దౌర్జన్యానికి దిగాడు. సోమవారం ఆశావర్కర్ లక్ష్మీదేవిపై కట్టెతో దాడి చేయడంతో ఆమె చేయి విరిగి, తీవ్రంగా గాయపడింది. లక్ష్మీదేవి తన గొర్రెల దొడ్డిలో పని చేసుకుంటుండగా పెద్ద ఫక్కీరప్ప అక్కడికి వెళ్లి దుర్భాషలాడాడు. ఎందుకు తిడుతున్నావని అడగ్గా.. కట్టెతో దాడిచేశాడు. తలపై కట్టెతో కొడుతుండడంతో ఆమె చేయి అడ్డం పెట్టింది. దీంతో చేయి విరిగింది. అడ్డువచ్చిన లక్ష్మీదేవి కుమార్తె, 3 నెలల బాలింత అయిన శశిపై దాడి చేశాడు. గాయపడిన లక్ష్మీదేవి, ఆమె కుమార్తె శశిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్ద ఫక్కీరప్ప గతంలో కూడా గొర్రెల మేపు విషయంలో తమపై దాడికి వచ్చాడనీ, అప్పట్నుంచి తాము కనిపిస్తే బూతులు తిడుతూ దాడికి యత్నిస్తుండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. పెద్దఫక్కీరప్ప తరచూ గ్రామస్థులపై దాడి చేస్తున్నాడనీ, మహిళలు అని కూడా చూడకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాడనీ, తనకు వైసీపీ నాయకుల అండ ఉందంటూ భయభ్రాంతులకు లోను చేస్తున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

గోరంట్ల ఎస్ఐ బాబు సస్పెన్షన్

గోరంట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లిలో దళితుడిపై దాడి వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్ఐ బాబును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలికను వెంట తీసుకెళ్లాడని దళితుడు ఆంజనేయులును ఈనెల 21న నార్సింపల్లిలో విద్యుత్ స్తంభానికి కట్టేసి, దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు ఆంజనేయులుపై పోక్సో కేసు కట్టారు. ఈ నేపథ్యంలో మూడురోజుల క్రితం ఎస్పీ నార్సింపల్లికి చెందిన రెండు కుటుంబాల వారిని విచారించారు. ఘటనను సీరియస్‌గా తీసుకోవడంతో బాలిక బంధువులు ఏడుగురిని అరెస్టు చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వెంకటశివారెడ్డిని అరెస్టు చేశారు. ఆంజనేయులుపై దాడి అనంతరం పోలీసు స్టేషన్‌లో విచారణ సమయంలోనూ, కేసు నమోదు విషయంలో ఎస్ఐ బాబు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్పీ విచారణలో తేలింది. దీంతో ఎస్ఐపై చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

రైల్వే డివిజన్‌కు మూడు అవార్డులు

గుంతకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో నిబద్ధత చూపిన ముగ్గురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డుల లభించాయి. జోనల్ కేంద్రంలోని రైల్ నిలయంలో వివిధ రైల్వే డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. గుంతకల్లు, హైదరాబాద్ డివిజన్లలో ముగ్గురు ఉద్యోగులు చెప్పున, విజయవాడ డివిజన్‌లో ఇద్దరికి, సికింద్రాబాద్ డివిజన్‌లో ఒకరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. విధుల్లో అప్రమత్తత, ఆపత్కాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, తదితర అంశాలు ప్రాతిపదికగా ఈ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ వెల్లడించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కల్లు గీత ఉపకులాలకు కేటాయించిన 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లోగానీ, హైబ్రిడ్ పద్ధతిలోగానీ వచ్చేనెల 5వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6న దరఖాస్తుల పరిశీలన, 7న లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఆయా కల్లుగీత ఉప కులాలకు చెందిన అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సాహితీ స్రష్ట.. మాడుగుల

వరించి వచ్చిన పద్మశ్రీ పురస్కారం
కడవకల్లులో గ్రామస్థుల హర్షం


మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో మాడుగుల నాగఫణిశర్మ


మాడుగుల నాగఫణిశర్మ

పుట్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అపారమైన పాండిత్యంతో అవధానాలలో మేటిగా నిలుస్తూ ప్రశంసలు పొందుతున్నారు మండలానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మ. ఈయన వందల కొద్ది అష్టావధానాలు చేసి, శతావధాని, సహస్రఫణి, బృహత్ ద్వి సహస్రావధానిగా కీర్తి గడించారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలోని కడవకల్లు గ్రామం. 1959 జూన్ 8న నాగభూషణశర్మ, సుశీలమ్మ దంపతులకు రెండో సంతానంగా మాడుగుల నాగఫణి శర్మ జన్మించారు. ఈయన పదో తరగతి వరకు కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడపజిల్లా ప్రొద్దుటూరులో విద్యాభ్యాసం సాగింది. తర్వాత సాహిత్యశిరోమణి పట్టా కోసం తిరుపతి వెళ్లారు. అక్కడ కపిలతీర్థం వీధుల్లో ప్రశాంత వాతావరణంలో ఉన్న ప్రాచ్య కళాశాల ఆయనలోని అక్షరదీప్తిని జాగృతం చేసింది. అక్కడ ఉపన్యాసం చేయడం మొదలు పెట్టా రు. అనంతరం మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, ఢిల్లీలో రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి శిక్షాశాస్త్రి, తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1985-1990 మధ్యకాలంలో కడప రామకృష్ణ జూనియర్ కళాశాలలో సంస్కృత ఉపన్యాసకుడిగా పనిచేశారు. 1990నుంచి 1992మధ్య కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మప్రచార పరిషత్తు అడిషనల్ కార్యదర్శిగా కూడా నాగఫణిశర్మ పనిచేశారు. ఈయన ప్రతిభను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. దీంతో ఆయన స్వగ్రామమైన కడవకల్లులో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పాండిత్యానికి ప్రశంసలు

మాడుగుల నాగఫణిశర్మ తన సాహిత్య ప్రతిభతో మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ, మాజీ ప్రధాన మంత్రులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి సమక్షంలో అవధానం నిర్వహించి ప్రశంసలు అందుకున్నాడు. ఈయన ప్రతిభకు అప్పట్లోనే శతావధానిసామ్రాట్, శతావధాన చూడామణి, కళాసాహిత్య కల్పద్రుమ వంటి ఎన్నో బిరుదులు వచ్చాయి. పలుచోట్ల పలువురు అభిమానులు కనకాభిషేకాలు, స్వర్ణశారదా ముద్రిక, ముత్యాలజల్లు, ఆందోళికాభోగం, స్వర్ణకంకణం, గండపెండేరం వంటివి చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనకు జ్యోతిష్యశాస్త్రంలో కూడా మంచి ప్రావీణ్యం ఉండటం గమనార్హం.



చాలా ఆనందంగా ఉంది

మా గ్రామంలో పుట్టి పెరిగిన మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ పురస్కారం దక్కడం చాలా సంతోషం కలిగిస్తోంది. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇవ్వడం మా గ్రామానికే గర్వకారణం. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఎంచుకున్న రంగాలలో రాణించేందుకు ప్రయత్నించాలి.

\- రామాంజనేయులు, కడవకల్లు

గ్రామానికి గుర్తింపు

మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడంతో మా గ్రామానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. నాగఫణిశర్మ అద్భుతంగా ఉపన్యాసాలు ఇచ్చేవారని మా నాన్న చెప్పేవారు. ఆయన ప్రతిభ గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం హర్షించదగ్గ విషయం. అంత గొప్ప పండితుడు మా ఊర్లో పుట్టడం గర్వంగా ఉంది.

\- నాగేశ్వర్‌రెడ్డి, కడవకల్లు



జాగ్రత్తగా పని చేయండి

- హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం
- ఎమ్మెల్యే పరిటాల సునీత


బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. ప్రతి విద్యార్థిని తమ సొంతబిడ్డలా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్‌లదేనన్నారు. చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర, ఎస్సీబాలికల హాస్టళ్లను సోమవారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లో గణతంత్ర దినోత్సవం రోజున మధ్యాహ్నం భోజనం లేక విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడిన సంఘటనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో భోజనం బాగుందా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవని, తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హాస్టల్‌లోని ప్రతి గదితో పాటు భోజన నాణ్యతను పరిశీలించారు. తర్వాత ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించి కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ హాస్టల్ భవనం దెబ్బ తిందని, మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని రూ.40లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని, మరోసారి కూడా తీసుకెళ్తామని తెలిపారు. హాస్టల్‌లో తాత్కాలిక మరమతుల కోసం కలెక్టర్ రూ.10లక్షలు మంజూరు చేస్తామని తెలిపారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సౌకర్యాల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నా రు. ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.33.80లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.32.40 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ నరసింహమూర్తి, వార్డెన్‌లు నరసింహమూర్తి, శ్యామల, టీడీపీ మండల కన్వీనర్‌ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, అంకేఅమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం సిగ్గుపడేలా..!



పురస్కార ధ్రువపత్రం.. ఇన్‌సెట్‌లో వార్డెన్ నారాయణ స్వామి

చెన్నేకొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పస్తులుంచి.. సస్పెండైన చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ నారాయణ స్వామి.. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలలో 'ఉత్తమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్'గా పురస్కారం అందుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో గణతంత్ర పురస్కారాలను అందుకు అతితక్కువ మంది వార్డెన్‌లలో నారాయణస్వామి ఒకరు. ఆదివారం ఉదయం పురస్కారం అందుకున్న ఆయన.. సాయంత్రానికి సస్పెండ్ అయ్యారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందలేదని తెలిసి హాస్టల్‌కు వెళ్లిన ఆర్డీఓకు స్థానికులు పలు ఫిర్యాదులు చేశారు. విధి నిర్వహణలో వార్డెన్ నిర్లక్ష్యంగా ఉంటారని, మద్యం సేవించి వస్తారని వివరించారు. పురస్కారాల జాబితాలో చేర్చే సమయంలో కనీస వివరాలు సేకరించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎవరికిపడితే వారికి..

ప్రజలకు మెరుగైన సేవలు అందించేవారు, నిజాయితీగల అ ధికారులను గౌరవించేందుకు గణతంత్ర వేడుకలలో ప్ర భుత్వం పురస్కారాలను అందజేస్తుంది. కానీ పురస్కారాల ఎంపిక ప్రక్రియ ప్రహసనంగా మారుతోంది. నీతి, నిజాయితీతో సంబంధం లేదు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి అవసరం లేదు. సిఫార్సు ఉంటే చాలు.. జాబితాలో చేరిపోవచ్చు. ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చిన జాబితాను గుడ్డిగా ఆమోదిస్తున్నారు. పద్ధతిగా పనిచేసే అధికారులు, ఉద్యోగులను వేళ్లమీద లెక్కబెట్టవచ్చు. కానీ గణతంత్ర వేడుకలలో పురస్కారాలు అందుకునేవారు వందల్లో ఉంటున్నారు. నిజాయితీగా పనిచేసి పురస్కారం దక్కించుకున్నవా రు. తమతోఎటుఉ అసమర్థులు, అవినీతిపరులు కూడా పురస్కారం అందుకోవడాన్ని జీర్ణించుకోలేకున్నారు. ఇలా ఎవరికిపడితే వారికి పురస్కారాలు అందించే ఆలోచన ఉంటే.. తమలాంటివారికి ఇవ్వకపోతేనే మంచిదని అంటున్నారు. 'మరకల' సరసన నిలబడేందుకు అసౌకర్యంగా ఉందని అంటున్నారు.

పగలే గొలుసు చోరీకి యత్నం

- ప్రతిఘటించిన మహిళ


చోరీ విషయాన్ని వివరిస్తున్న భార్గవి

ఓబుళదేవరచెరువు, జనవరి27(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో రెయిన్ బో పాఠశాల వద్ద భారత్ కూల్‌డ్రింక్స్ దుకాణంలో సోమవారం పగలే గొలుసు చోరీకి దుండగులు యత్నించారు. బాధితురాలు ప్రతిఘటించడంతో దొరికినకాడికి దోచుకెళ్లారు. మండల కేంద్రానికి చెందిన భార్గవి రెయిన్‌బో పాఠశాల వద్ద కూల్‌డ్రింక్స్ చిల్లర దుకాణం నడుపుతోంది. ఆమె భర్త వెంకటరామిరెడ్డి పనినిమిత్తం పొరుగూరు వెళ్లాడు. ఆమె ఒంటరిగా ఉన్న విషయానిన గుర్తించిన దుండగులు ఇద్దరు బైక్‌పై అక్కడికెళ్లారు. ఒకరు దుకాణంలోకి వెళ్లి రూ.20 ఇచ్చి అర లీటరు వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడు. మిగిలిన రూ.పది చిల్లర ఇచ్చేందుకు ఆమె డబ్బు పెట్టెను తీస్తుండగా ఆమె మెడలోని మంగళసూత్రంచైన్‌ను లాగాడు. భార్గవి రెండు చేతులతో చైన్‌ను గట్టిగా పట్టుకుని కేకలు వేసింది. చైన్ తెగిపోవడంతో అందులో కొంతభాగాన్ని దుండగుడు తీసుకుని, అప్పటికే ఆన్‌చేసి ఉన్న ద్విచక్రవాహనం ఎక్కి ఉడాయించారు. అంతటితో ఆగని బాధితురాలు.. చైన్‌స్నాచర్‌పై కత్తి విసిరింది. అయినా వారు ఉడాయించారు. చుట్టుపక్కలవారు 100కి ఫోన్ చేయడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. చైన్ స్నాచర్స్ కోసం వెతగ్గా.. వారు దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విచారిస్తున్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన పన్ను వసూళ్లకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. గడువులోపు పన్నులు వసూలు చేయకపోతే ఇబ్బందులు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పంచాయతీల్లో పన్ను వసూళ్లకు సంబంధించి గడువు లోపు టార్గెట్‌లు పూర్తి చేయాలని హెచ్చరిస్తున్నా, కొంత మంది సిబ్బందిలో ఏమాత్రం చలనం లేదన్నారు. ఇప్పటికే పన్ను వసూళ్లలో వెనుకబడిన వారికి సంబంధించిన జాబితా సిద్ధం చేశామని, అందుకు అనుగుణంగా తరచూ సమీక్షిస్తామన్నారు. గడువులోపు పంచాయతీలకు రావాల్సిన పన్నులు, నాన్‌ట్యాక్సులకు సంబంధించి వంద శాతం రాబట్టాల్సిందేనని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదలచేసినట్లు సోమవారం ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. తన కార్యాలయంలో వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళితో కలిసి ఆమె ఫలితాలను విడుదలచేసి మాట్లాడారు. డిసెంబరులో డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీఏ 62, బీకామ్ 57, బీఎస్సీ 60, బీబీఏ 48 శాతం చొప్పున విద్యార్థులు పాస్ అయ్యారని వివరించారు. మొదటి సెమిస్టర్‌తోపాటు తృతీయ, ఐదో సెమిస్టర్ రివాల్యుయేషన్ కోసం ఫిబ్రవరి 4లోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామకృష్ణ, అధికారులు చలపతి, శ్రీనివాసులు, నాగార్జున, విభాగాధిపతులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠం గా రూ. 9వేలు, సరాసరి రూ. 10వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపా రు. మార్కెట్‌కు మొత్తం 12 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అనర్హుల్లో ఆందోళన..!

- పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిన ప్రభుత్వం
- అనంతపురం, గుంతకల్లు ఆస్పత్రులలో దివ్యాంగుల పరిశీలన


ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పెన్షన్ వెరిఫికేషన్‌కు హాజరైన దివ్యాంగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల వెరిఫికేషన్‌తో అనర్హుల్లో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వంలో ఎడాపెడా సర్టిఫికెట్లు పొంది పలువురు అనర్హులు పింఛన్ పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏరివేత ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారి ఇంటింటి వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇలాంటివారిని 2499మందిని గుర్తించగా, 1178మంది వెరిఫికేషన్‌ను పూర్తి చేశారు. మిగిలిన వారివి పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దివ్యాంగుల పింఛన్లను కూడా పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రూ.ఆరు వేలు పింఛన్ పొందుతున్న 45,820మంది పింఛన్‌దారుల సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు. ఇందుకు జిల్లా కేంద్రం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులలో డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సోమవారం రెండు ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందికిపైగా పింఛన్‌దారులు వెరిఫికేషన్‌కు హాజరుకావడంతో ఆయా ఆసుపత్రుల ప్రాంగణాలు కిటకిటలాడాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన 12మంది డాక్టర్ల బృందాలు, డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు పింఛన్‌దారుల పునఃపరిశీలన చేపట్టారు. ఇందులో 8 మంది బుద్ధిమాంద్యం డాక్టర్లు, ఇద్దరు ఈఎన్‌టీ డాక్టర్లు, ఇద్దరు సైక్రియాటిస్టులను ప్రభుత్వం నియమించింది. ప్రతి సోమ, మంగళ బుధవారాల్లో పునఃపరిశీలన చేయనున్నారు. అనంతరం డాక్టర్ల బృందాలు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. 12మంది డాక్టర్లను ఆరు టీంలుగా ఏర్పాటు చేశారు. ప్రతి డాక్టర్ వారంలో మూడు రోజుల పాటు రోజుకు కనీసం 50 పింఛన్‌దారుల సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు.


ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్‌దారులను పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

జిల్లాలో వెరిఫికేషన్ చేయాల్సిన పింఛన్లు 45,820

జిల్లాలో 45,820మంది పింఛన్లు వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందులో ఆర్థోపెడిక్‌కు సంబంధించి 24,700మంది, అంధులు 5,124 మంది, చెవిటి, మూగ 6,705మంది, బుద్ధిమాంద్యం 5,102మంది, మానసిక రోగులు 1036మంది, ఇతర దివ్యాంగులు 3,153మంది ఉన్నారు.

1,178మందికి వెరిఫికేషన్ పూర్తి

జిల్లాలో మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల వెరిఫికేషన్ ప్రారంభించారు. మొత్తం 2499మందిని గుర్తించగా ఇప్పటి వరకు 1178మంది వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ పాలనలో 6టీంలు పింఛన్‌పరిశీలన ప్రారంభించారు. ఇందులో ఆర్థోపెడిక్ డాక్టర్, జనరల్ సర్జన్ డాక్టర్‌లతో ఆశావర్కర్లు, వెలుగు సిబ్బంది పాల్గొంటున్నారు. ఆరువారాల్లో పూర్తి చేయాలని ఇప్పటికే డాక్టర్లకు ప్రభుత్వం సూచించింది. ఇళ్లవద్దకే వెళ్లి ప్రత్యేకంగా నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

అభివృద్ధి అంతంతే..!

అనంత కార్పొరేషన్ అయ్యాక 32వ డివిజన్ ఏర్పాటు

- రెండు దశాబ్దాలుగా సమస్యలు
- ఇప్పటివరకు ముగ్గురు కార్పొరేటర్లు ఎన్నిక
- మౌలిక వసతులు కల్పించాలని జనం వినతి

అనంతపురం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీగా ఉన్న అనంతపురాన్ని కార్పొరేషన్‌గా మార్చాక 32వ డివిజన్ ప్రత్యేకంగా ఏర్పడింది. అనంతపురం గతంలో మున్సిపాలిటీగా ఉండేది. 2005లో నగరపాలక సంస్థగా రూపాంతరం చెందింది. ఈ క్రమంలో 28 వార్డులున్న అనంతపురాన్ని 50 డివిజన్లుగా మార్చారు. విభజనలో భాగంగా 32వ డివిజన్ ఏర్పడింది. ఆ డివిజన్ పరిధిలో ప్రస్తుతం విద్యుత్‌నగర్, ఆదర్శనగర్, ఓబుళ దేవ్‌నగర్, లక్ష్మీనరసయ్య కాలనీలో కొంతభాగం, సెవెన్‌హిల్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో దాదాపు 1500ఇళ్లు ఉండ గా, మొత్తం 6250 ఓట్లు ఉన్నాయి. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు నిధులు లేకపోవడంతో, అధిక కాలనీలున్న ప్రాంతంలో ఉండటంతో అభివృద్ధి ఏమాత్రం ఉండేది కాదు. ప్రత్యేక



డ్రైనేజీల్లో కదలని మురుగునీరు


డివిజన్‌లో మారని మట్టి రోడ్లు

డివిజన్‌గా ఏర్పాటయ్యాక కూడా మార్పు లేదు. అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందని స్థానికులు చెబుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

అప్పట్లో శివారు కాలనీలు

ఈ డివిజన్ పరిధిలో తొలుత ఏర్పడింది విద్యుత్ నగర్. ఆ తరువాత ఓబుళదేవ్‌నగర్, ఆదర్శనగర్ ఏర్పడ్డాయి. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు సాయినగర్ మూడో క్రాస్ నుంచి ఈ కాలనీలన్నీ అప్పుడు ఒకే వార్డు పరిధిలో ఉండేవి. అప్పట్లో ఇవి శివారు కాలనీలు. 2005లో తొలిసారి కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. క్రమంగా లక్ష్మీనరసయ్య కాలనీ ఏర్పడింది. ఇక కొందరు ఇళ్లు కట్టుకుని సెవెన్‌హిల్స్ కాలనీని ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో ఎఫ్‌సీఐ కాలనీ ఏర్పడింది.

కాలనీలో ప్రముఖులెవరంటే..

డివిజన్ పరిధిలో మాజీ మంత్రి శైలజానాథ్ నివాసముంటున్నారు. ఆయన రాజకీయాల్లోకి రాకమునుపు నుంచే ఆదర్శనగర్‌లో ఉంటున్నారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విద్యుత్ నగర్‌లో నివాసముంటున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాల వారే ఉన్నారు. సమీపంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నవారు కొందరైతే... అద్దె ఇళ్లల్లో నివాసముంటున్న వారు మరికొందరు ఉన్నారు.

ముగ్గురు కార్పొరేటర్ల ఎన్నిక

ఈ డివిజన్ ప్రత్యేకంగా ఏర్పాటయ్యాక మూడుసార్లు కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. 2005లో కాంగ్రెస్ పార్టీ తరపున చవ్వా మనోహర్ రెడ్డి, 2014లో టీడీపీ తరపున బంగి సుదర్శన్, 2021లో వైసీపీ తరపున కమల్‌భూషణ్ కార్పొరేటర్లుగా ఎన్ని కయ్యారు. ఈ డివిజన్‌లో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 50 లక్షల నిధులతో బుద్ధవిహార్ పార్క్ ఏర్పాటు చేశారు. అదే సందర్భంలో స్కేటింగ్ గ్రౌండ్ ఏర్పాటైంది.

న్యూస్ బాక్స్

ఇన్‌చార్జ్ వార్డెన్‌గా నరసింహమూర్తి

చెన్నేకొత్తపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్‌గా జి.నరసింహమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వార్డెన్ నారాయణ స్వామి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించలేదన్న కారణంగా ఆదివారం సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. దీంతో రామగిరి ప్రభుత్వ కళాశాల బీసీబాలుర వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్నవార్డెన్ నరసింహమూర్తిని ఇక్కడ ఇన్‌చార్జ్ వార్డెన్‌గా అధికారులు నియమించారు.

ఏఓగా కవిత బాధ్యతల స్వీకరణ

రామగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖా ధికారిగా ఎస్.కవిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంటనే ఆమె వెంకటాపురానికి వెళ్లి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయశాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ఎంపిక

రాప్తాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శిగా రాప్తాడు మండలం గొల్లపల్లికి చెందిన నరేష్‌ను ఎంపిక చేసినట్లు వాల్మీకి సేవా సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక...

గార్లదిన్నె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా నిచ్చెనమెట్ల సురేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక శివాలయంలో సోమవారం ఆర్య వైశ్య సంఘం రాయలసీమ రీజినల్ చైర్మన్ నగురూరు చంద్ర మహేష్ ఆధ్వర్యంలో ఆ సంఘం జనరల్‌బాడీ సమావేశం జరిగింది. మండల కమిటీ అధ్యక్షుడిగా నిచ్చెనమెట్ల సురేష్ బాబును, ఉపాధ్యక్షుడిగా పిన్ని రమణయ్య, సెక్రటరీగా కందూరి శివప్రసాద్, కోశాధికారిగా సి. పవన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

పింఛన్ల పరిశీలన

చెన్నేకొత్తపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంచానికే పరిమితమైన రోగుల సామాజిక పింఛనను సోమవారం అధికారులు పరిశీలించారు. ముష్టికో వెల సచివాలయంతో పాటు న్యామద్దల-1, 2, చెన్నేకొత్తపల్లి-1, 2, నాగసముద్రం, పులేటిపల్లి సచివాలయాల పరిధిలో వైద్య బృందం పరిశీలించింది. జిల్లా స్థాయి అసిస్టెంట్ మెడికల్ ప్రొఫెసర్లు డాక్టర్ రాఘవేంద్రరాజు, డాక్టర్ ఇమ్రాన్‌బాషా ఖాద్రీ అర్హులను గుర్తించ డానికి తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవినాయక్, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

గార్లదిన్నె, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నేసే బ్రహ్మయ్య (55) మృతి పార్టీకి తీరని లోటు అని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెనకచెర్ల డ్యాం గ్రామానికి చెందిన నేసే బ్రహ్మయ్య గత కొంతకాలం క్రితం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవా రం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ముంటి మడుగు కేశవరెడ్డి, గేటు క్రిష్టారెడ్డి, నరసింహారెడ్డి, చితంబరప్ప, సురేష్, చిరంజీవి తదితర నాయకులు పెనకచెర్ల డ్యాంకు వెళ్లి బ్రహ్మయ్య భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

దేశ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి: ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో సమర్థవంతంగా ప్రతిస్పందించి విపత్తు నిరోధక దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి ఎన్‌సీసీ క్యాడెట్లకు పిలుపునిచ్చారు. సోమవారం కళాశాల ఆడిటోరియంలో జేఎన్టీయూ ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ శారద అధ్యక్షతన 'విపత్తుల సమయంలో సమగ్ర, చురుకైన ప్రతిస్పందన' అనే అంశంపై క్యాడెట్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి హాజరై సదస్సును ప్రారంభించి మాట్లాడారు.

ఆ కళాశాలలపై చర్య తీసుకోవాలి

- కలెక్టరేట్ వద్ద విద్యార్థి సంఘాల నేతల ధర్నా

అనంతపురం విద్య, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ విద్యా సంస్థకు చెందిన జూనియర్ కళాశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, వైఎస్ఆర్ విద్యార్థి సంఘం, ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ ఇతర సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్పొరేట్ కాలేజీలకు తొత్తుగా వ్యవహరిస్తున్న ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. చరణ్ ఆత్మహత్య ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో పెండింగ్ ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు ఇవ్వాలన్నారు. కళాశాలపై చర్యలు తీసుకో కుంటే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆటో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు

అనంతపురం కల్చరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : నగరంలోని గుత్తిరోడ్డులో సోమవారం ఆర్టీసీ బస్సును ఢీకొనబోయి ఆటో బోల్తా పడింది. ఘటనలో ఆటో డ్రైవర్ వెంకటేష్ స్వల్పంగా గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. సోమవారం ఉదయం 11.10 గంటల సమయంలో గుత్తి డిపోకు చెందిన ఏపీ39జడ్ 0877 నంబరు ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో అనంతపురం బస్టాండు నుంచి కర్నూలుకు బయలు దేరింది. నగర శివారులో గుత్తిరోడ్డులో బళ్ల కన్వెన్షన్ హాల్ ఎదుట, పక్కనే ఏపి21టివె 0317 నెంబరు గల ఆటో వస్తూ అదుపు కాలేక బోల్తాపడి బస్సుకు అడ్డంగా వెళ్లింది. బస్సు డ్రైవర్ బ్రేక్ వేసి వేగాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ వెంకటేష్ ముఖానికి గాయమవడంతో స్థానికులు ప్రభుత్వ సర్వజనాస్ప త్రికి తరలించారు. ఘటన నేపథ్యంలో బస్సులోని ప్రయాణికులను వెనుకే వస్తున్న మరో బస్సులో ఎక్కించి పంపారు. ప్రమాద విషయం తెలుసుకున్న అనంతపురం డీఎం నాగభూపాల్ అక్కడికి చేరుకుని బస్సును పరిశీలించడంతోపాటు స్థానికంగా సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు.

చిన్నారిపై గంజి.. కేసు నమోదు

అనంతపురం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాణినగర్‌లో వారం రోజుల క్రితం చిన్నారిపై గంజి పడిన ఘటనలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైం ది. ముబీనాబేగం కుమార్తె ఏడాది చిన్నారిని పక్కింట్లోని హర్షియా ఆడించుకోవడానికి తీసుకెళ్లింది. వారు నిర్లక్ష్యంగా ఉండటం వల్లనే గంజి పడిందని ముబీనాబేగం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొదటిరోడ్డుకు చెందిన ఓ యువతి అదృశ్యమైంది. డిగ్రీ పూర్తి చేసిన ఆ యువతి తన ఇంటి నుంచి అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఉదయం నుంచి ఫోన్ చేస్తుంటే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పారిశ్రామిక రంగానికి వెలుగులు తెస్తున్నారు

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వెలుగులు తెస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యా దవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ దావోస్ పర్యటన విజయవంత అయిందన్నారు. వైసీపీ ఐదేళ్లల్లో తీసుకురాలేని పెట్టుబడులను ఏడు నెలల్లోనే తీసుకొస్తున్నారన్నారు. దావోస్‌లోని పారిశ్రామిక వేత్తలను కలిసి రాష్ట్రం లోని వనరులను వివరించి పెట్టుబడులను ఆకర్షించారన్నారు. ఏపీతో పాటు దేశంలోనే పెట్టుబడులు పెట్టాలని సీఎం మాట్లాడిన తీరును ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నారన్నారు. జిల్లాకు కూడా పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణలు ఇస్తారని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, ముంటిమడుగు కేశవరెడ్డి, సరిపూటి రమణ, కూచి హరి, స్వామిదాస్, వెంకటప్ప, సంగా తేజస్విని, వడ్డే భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అఖిల్‌కుమార్ రెడ్డి

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అఖిల్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు విశాఖపట్నంలో నిర్వహించిన మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు నియామక పత్రాన్ని అందజేసినట్లు అఖిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. విద్యారంగ సమస్యలపై నిరంతరంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విపణిలోకి ఎస్‌యూవీ కియా సిరోస్


కారును ఆవిష్కరిస్తున్న ఎంజీబీ సీఈఓ ఆదిత్య మాచాని తదితరులు

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లోకి ఎస్‌యూవీ కియా సిరోస్‌ను సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగర శివారులోని ఎంజీ బ్రదర్స్‌లో కియ కారును ఎంజీ బ్రదర్స్ సీఈఓ ఆదిత్య మాచాని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కియ సిరోస్ పెట్రోల్, డీజిల్, మాన్యువల్ అండ్ ఆటోమేటిక్ వేరియంట్లలో అందుబాటులోకి వస్తోందన్నారు. ఎనిమిది ఆకర్షణీయమైన రంగులతో లభ్యమవుతున్నాయన్నారు. 30 ఇన్‌చెస్ డిస్‌ప్లే, స్లైడింగ్‌తో కూడిన రిక్లైనర్ మోడల్‌లో ఉన్న వెనుక సీటు, స్ట్రీమ్‌లైన్ డోర్ హ్యాండిల్స్, ఓటిఏ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వంటి ఫీచర్లతో వచ్చిందన్నారు. ఈతరహా సెగ్మెంట్‌లో సిరోస్ మొదటిదని తెలిపారు. ఎక్స్-షోరూమ్ ధరను ఫిబ్రవరి1 న ప్రకటిస్తామన్నారు. ఎంజీబీ జనరల్ మేనేజర్ ఎల్లప్ప, జనరల్ మేనేజర్ సేల్స్ గిరిప్రసాద్, సేల్స్ మేనేజర్ సుబ్బరామయ్య తోపాటు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్, ప్రముఖ యూట్యూబర్ వైభవ్ పాల్గొన్నారు.

ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా నారాయణ నాయక్

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా నారాయణ నాయక్ ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆర్పీఎస్, ఆర్‌ఈఎఫ్ నాయకులు నాగరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నారాయణ నాయక్‌తోపాటు కోకన్వీనర్‌లుగా చిట్టయ్య(వైజాగ్), హరికృష్ణ(విజయవాడ), ఆంజనేయులు(కడప), లక్ష్మణ్(కర్నూలు), సతీష్‌కుమార్(అనంతపురం), పామన్న యాదవ్(నంద్యాల), రాజశేఖర్, మర్రిస్వామి, చింతన్నను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రామాయపట్నం పోర్ట్ కార్పొరేషన్ ఈడీగా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి రామాయపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీగా డిప్యుటేషన్‌పై వెళ్లనున్నారు. ఈ మేరకు సోమవారం ఆ పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యదర్శి సురేష్‌కుమార్ జీఓ విడుదల చేశారు. అనంత ఎస్సీ వెల్ఫేర్ డీడీగా వచ్చే సమయంలోనే ఆయన రామాయపట్నం పోర్ట్ ఈడీగా డిప్యు టేషన్ వెళ్లేందుకు ఫైలు పెట్టుకున్నట్లు సమాచారం. తాజాగా రామాయపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యదర్శి ఒక సంవత్సరకాల పరిమితితో ఆయనకు డిప్యుటేషన్ వేశారు. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ప్రస్తుతం ఎస్సీ వెల్ఫేర్ డీడీతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా ఉన్నారు. ఆయన డిప్యుటేషన్‌పై వెళ్తుండటంతో ఆ రెండు పోస్టుల ఖాళీలు ఏర్పడనున్నాయి.

దళితులపై కేసులు ఆగవా...?

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో దళితులను నిర్దాక్షిణ్యంగా బలితీసుకున్నారని, కూటమి ప్రభుత్వంలోనూ దళితులపైనే అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడతారా? అని పలు దళిత సంఘాల నాయకులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దళితులపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలంటూ సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నాచేపట్టారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అక్కులప్ప, కేపీ నారాయణస్వామి, అధ్యక్షులు చంద్ర, చిన్నాంజనేయులు, దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు బీకేఎస్ ఆనంద్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, ఎంఎస్ఎఫ్ నగేష్, వికలాంగుల సంఘం అధ్యక్షుడు ప్రకాష్ హాజరయ్యారు. గుడిసె దేవానంద్ విషయంపై హోంమంత్రి అనితను కలిసి ఫిర్యాదుచేస్తామని తెలిపారు. అనంతరం డీఐజీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


బుక్కరాయసముద్రంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న పసుపుల శ్రీరామిరెడ్డి

బుక్కరాయసముద్రం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మాతాఫుడ్స్ కంపెనీ చైర్మన్ పసుపుల శ్రీరామిరెడ్డి, డైరెక్టర్ పసుపుల హనుమంతరెడ్డి, పసుపుల నారాయణరెడ్డి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని బుక్కరాయసముద్రం, కొర్రపాడు, సిద్దరాంపురం, వెంకటాపురం, రోటరీపురం, కేజీబీవీ, ఆర్డీటీ గురుకల పాఠశాలలో చదువుతున్న దాదాపు 1200 మంది విద్యార్థులకు వారు సోమవారం ఉచితంగా అందజేశారు. ఎస్టీయూ సహకారంతో ఈ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్ నారాయణస్వామి, పొడరాళ్ల రవీంద్ర, కేశన్న, ఓబులపతి, జొన్నా రామయ్య, ప్రధానోపాధ్యాయరాలు వసుంధర, ఉపాధ్యాయ సంఘాల నేతలు సూర్యుడు, కేశవరెడ్డి, బాబ్జీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి: కలెక్టర్


దివ్యాంగుల వద్దకే వెళ్లి వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితుల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించ డం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ నిర్వహించారు. గతవారం గ్రీవెన్స్ లేకపోవడంతో ఈ వారం బాధితులు పెద్దఎత్తున తరలి వచ్చారు మొత్తం 520మంది అధికారులకు వినతులు అందజేశారు. కలెక్టర్ వినోద్ కుమార్, జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, మల్లికార్జున తదితరులు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ వినోద్ కుమార్ దివ్యాంగుల వద్దకే వెళ్లి వినతులు తీసుకున్నారు. అనంతరం జిల్లా అధికారులతో అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు.

గణతంత్ర వేడుకల నిర్వహణ భేష్

జిల్లాకేంద్రంలో గణతంత్ర వేడుకలను బాగా నిర్వహించారని కలెక్టర్ వినోద్‌కుమార్ యంత్రాంగాన్ని కొనియాడారు. ప్రత్యేకంగా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ప్రత్యేక శ్రద్ధ వహించారని ప్రశంసించారు.

31న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్

అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌ను ఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. హార్టికల్చర్ డీడీ, ఏపీఎంఐపీ పీడీలు కలిసికట్టుగా ఏర్పాట్లుచేయాలని సూచించారు. అగ్రికల్చర్ అండ్ కోఆపరేటివ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధికి మంత్రి హామీ : టీసీ వరుణ్


మంత్రి నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అహుడా అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ హామీ ఇచ్చారని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. మంగళగిరిలో మంత్రి నారాయణను సోమవారం ఆయన కలిశారు. అహుడా అభివృద్ధి ప్రణాళికను మంత్రికి అందజేశామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

'వేతనాలు రాకుండా అడ్డుకుంటున్నారు'

అనంతపురం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తాను కొత్తచెరువు పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నానని, తనకు సంబంధించి మూడు నెలల వేతనాలు రాకుండా కొందరు అధికారులు అడ్డుకుంటున్నారని బాధితురాలు హేమలత బాయి ఆవేదన చెందారు. ఈ మేరకు సోమవారం పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో జేడీ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... మూడు నెలలుగా వేతనాలు రాకుండా అడ్డుకుంటున్నారని కన్నీట పర్యంతమైంది. పశుసంవర్ధక శాఖ జేడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించాలని కోరారు.

బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించే ఫాదర్‌ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలను సోమవారం హాకీ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, సత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

లఘుచిత్ర వారోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): షార్ట్‌ఫిల్మ్ సొసైటీ, అనంతపురం ఆధ్వర్యంలో సోమవారం జేజే కన్వెన్షన్ హాల్‌లో ఏడో అనంత లఘుచిత్ర వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీనాక్షమ్మ ఫౌండేషన్ అధినేత రవికాంత్ రమణ, ట్రినిటి హాస్పిటల్ అధినేత అజయ్‌కుమార్, అబ్బా టీవీ డాక్టర్ హరి ప్రసాద్, ఫ్రోక్స్ యాప్ అధినేత సుధీర్, జీఎంఎస్ గ్యాలరీ అధినేత సురేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. డిస్కవర్ అనీల్‌కుమార్, షార్ట్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు కంబదూరు షేక్ నబీరసూల్, తోట బాలన్న, రమేష్, కత్తి విజయ్‌కుమార్, జాకీర్ హుస్సేన్, టీవీ రెడ్డి, అల్తాఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా విస్తరణ పనులు చేపట్టాలి: వామపక్షాలు



జలవనరుల శాఖ సీఈ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పదివేల క్యూసెక్కుల నీటి సామర్థ్యానికి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ హంద్రీనీవా కార్యాలయం ఎదుట సీపీఎం జి ల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రైతులు, ఇతర నాయకులు చేసిన ఆందోళనతో 2021 జూన్ 7వతేదీన అప్పటి వైసీపీ ప్రభుత్వంలో 6300క్యూసెక్కుల సామర్థ్యా నికి పెంచుతూ కాలువ నిర్మాణం చేపడుతామని జీవో నంబరు 29ని తెచ్చినా, నిధులు విడు దల చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. హంద్రినీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ కోసం ఇప్పుడు కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓలు 404, 405లను వెంటనే రద్దు చేసి, 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలవ వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం జలవనరు లశాఖ సీఈ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, కార్యవర్గసభ్యులు రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాలరంగయ్య, కమిటీ సభ్యులు వెంకటనారాయణ, రామాంజినేయులు, ముత్తుజా, రైతుసంఘం నాయకులు శివారెడ్డి, సీపీఎం నగర నాయకులు వలీ, ప్రకాశ్‌రెడ్డి, కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, పోతులయ్య, రాజు, వెంటకేష్ తదితరులు పాల్గొన్నారు.

లైనింగ్ పనులు ఆపాలి : సీపీఐ

అనంతపురం విద్య: రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లైనింగ్ పనులు నిలిపివేసి, ఆయకట్టుకు సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సీపీ ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడు తూ.... సీమ జిల్లాలకు వరప్రసాదమైన హంద్రీనీవా ఉమ్మడి అనం తపురం జిల్లా వ్యాప్తంగా 3.45 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీరు అందిస్తోందన్నారు. రాయలసీమ జిల్లాల్లో వర్షాభావం వల్ల ఇతర జిల్లాలకు వలస వెళ్తున్నారని, రైతులు వలసలు పోకుండా ఉండాలంటే సమృద్ధిగా నీరు అందించాలన్నారు. అందుకు అనుగుణంగా కాలువ వెడెల్పు చేయకుండా, ప్రస్తుతం లైనింగ్ పనులు చేపడుతు న్నారని తెలిపారు. వెంటనే లైనింగ్ పనులు ఆపి, ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు.

రైతల కోసం ఫిబ్రవరి 4న హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయం వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శులు నారాయణస్వామి, మల్లికర్జున, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కేశవరెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు, ఇతర నాయకులు గోపాల్, సంజీవప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. బీకాం విద్యార్థులకు ఫోర్త్‌సెమిస్టర్‌కు కంప్యూటర్ అప్లికేషన్ బోధించడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంటెక్ కంప్యూటర్స్‌లో 55 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఆయా సబ్జెక్టులలో సెట్, నీట్ క్వాలిఫై అయిన వారికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు అర్హత ధృవీకరణపత్రాలతో బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక

రాయదుర్గంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షులుగా దర్శన్, లోకేష్, మైలార్, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణ, సహాయక కార్యదర్శిగా మోహన్, అజయ్, కమిటీ సభ్యులుగా అభి, దేవరాజ్, వంశీ, భరత్ తదితరులను ఎన్నుకున్నారు.

హెచ్చెల్సీకి అదనపు జలాలపై హర్షం

బొమ్మనహాళ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పని చేస్తున్నారని తుంగభద్ర కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి మల్లికార్జున, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున అన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి మరొక టీఎంసీ నీటిని అదనంగా తీసుకురావడంపై సోమవారం వారు మండలకేంద్రంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని కాలవశ్రీనివాసులు అదనంగా తుంగభద్ర నుంచి ఒక టీఎంసీ నీటిని తీసుకురావడం అభినందనీయమన్నారు. కాలవ రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పయ్యావుల నాగరాజు, యర్రగుంట్ల వెంకటేశులు, సల్లాపురం బాబు, నవీన్, సైకిల్‌షాప్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కసాపురం గ్రామస్థులు

గుంతకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ మండలంలోని కసాపురం గ్రామస్థులు పలువురు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో వారు ర్యాలీగా తరలివచ్చి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తామని మాట తప్పిందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారన్నారు. చెప్పిన మేరకు కసాపురంలో ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలను కేటాయించి, ఇంటి రుణాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, సభ్యులు టీ.రామాంజనేయులు, జక్కన్న, సూరి నాగమ్మ, జహీర, రాజశేఖర్, బాలాంజనేయులు, లక్ష్మి, ఆదినారాయణ, వన్నూర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా తిరిగొచ్చిన విద్యార్థి

కూడేరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కనపడకుండా పోయిన మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన విద్యార్థి రంజిత్ క్షేమంగా ఇంటికి తిరిగొచ్చాడు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రంజిత్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరి వెళ్లాడు. పాఠశాలకు వెళ్లకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వివిధ ప్రాంతాలలో గాలించినా ఆచూకీ తెలియరాలేదు. సోమవారం సాయంత్రం విద్యార్థి క్షేమంగా ఇంటికి తిరిగి రావడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

రక్తదాతకు సన్మానం

గుంతకల్లుటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అత్యధిక సార్లు రక్తదానం చేసిన గోపరాజు శ్రీనివాసరావుకు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో సోమవారం రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ వారు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రెహెమాన్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన గోపరాజు శ్రీనివాసరావు రక్తదానం, ప్లేట్లెట్స్, వైట్‌బ్లడ్‌సెల్స్, ప్లాస్మాతో కలిపి 267 దానం చేశారని తెలిపారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి షఫి, గౌరవ సలహాదారులు ఇస్మాయిల్, స్టేషన్‌మాస్టర్ హరిప్రసాద్, పలువురు రక్తదాతలు పాల్గొన్నారు.

నెట్‌సెంటర్ల నిర్వాహకులతో సమావేశం

యాడికి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డబ్బుకు ఆశపడి నకిలీ సర్టిఫికెట్లు సృష్టిస్తే సంబంధిత నెట్‌సెంటర్లను సీజ్‌చేస్తామని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన స్థానికంగా ఉన్న నెట్‌సెంటర్ల నిర్వాహకులతో పాటు, రాయలచెరువులోని వారికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. డబ్బుకు ఆశపడి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించడం, ఒకరి సర్టిఫికెట్లను తీసుకుని మార్ఫింగ్ చేయడం లాంటివి చేయరాదన్నారు. నకిలీ సర్టిఫికెట్లు సృష్టించినా, ప్రభుత్వ సేవా సర్వీసులను దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో కుమారస్వామి, పలువురు నెట్‌సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.


అటవీ అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు

శెట్టూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అటవీ అధికారుల నిర్లక్ష్యంపై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎమ్మార్పీఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో కొందరు చెట్లను నరికి పర్యావరణానికి ముప్పు తెస్తున్నారని, వన్యప్రాణులు పంటలను నాశనం చేస్తున్నాయని, ఇంతజరుగుతున్నా అటవీ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా వారు మేల్కొని అడవులను, పంటలను కాపాడేలా చర్యలు తీసుకునేలా చూడాలని విన్నవించారు. మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, నాయకులు ఉసిరిపాటి బ్రహ్మయ్య, ఎస్ఆర్ శివ, అనుంపల్లి మారెన్న, అనుంపల్లి బాబు, బసంపల్లి మహేష్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

బొమ్మనహాళ్, జనవరి27(ఆంధ్రజ్యోతి): వెలుగు వీఓఏలకు బకాయి వేతనాలు చెల్లించాలని, వారిపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆమె వెలుగు వీఓఏలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలవారి జీతాలు లేక వీఓఏలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. వీరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు ఓబులేసు, యానిమేటర్లు శీనా, సునీత, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుకోట రిజర్వాయర్‌కు జలకళ..



నీటితో నిండుగా ఉన్న రిజర్వాయర్

పెద్దపప్పూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఈ రిజర్వాయర్‌ను నీటితో నింపుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి నెరవేర్చారు. అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే సుబ్బరాయసాగర్ నుంచి నీటిని విడుదల చేయించారు. దీంతో ప్రస్తుతం రిజర్వాయర్ నిండుగా తొణికిసలాడుతోంది. ఈ రిజర్వాయర్ నిండడం వల్ల మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, చిక్కేపల్లి, షేక్‌పల్లి, నామనాంక పల్లి, కొత్తపల్లె, అమ్మలదిన్నెతో పాటు పుట్లూరు మండలంలోని అరటివేముల, సూరేపల్లి, కడవకల్లు గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్య తొలగినట్టేనని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో సైతం సమృద్ధిగా నీరు వస్తాయని, సుమారు ఐదు వేల ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీటి సమస్య ఉండదని చెబుతున్నారు. ముచ్చుకోట సమీపంలో చుట్టూ పచ్చటి కొండల నడుమ.. నీటితో నిండుగా ఉన్న రిజర్వాయర్‌ను చూసేందుకు రోజూ పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారు.

యువగళానికి రెండేళ్లు..

● టీడీపీ శ్రేణుల సంబరాలు



అన్నక్యాంటీన్‌లో స్వీట్లను పంపిణీ చేస్తున్న ఆనంద్‌రెడ్డి తదితరులు

గుంతకల్లు/ గుంతకల్లు టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ మాట్లాడుతూ.. యువగళం స్ఫూర్తితోనే టీడీపీ గత ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిందన్నారు. ఆ పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన భరోసాతోనే ప్రజలు ఉప్పెనగా మారి వైసీపీని అధికారం నుంచి పెకలించేశారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నారాలోకేష్ అభిమానం సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీహయాంలో అరాచకాలను ఎండగడుతూ.. జనం కన్నీళ్లు తుడుస్తూ నారా లోకేశ్ 226రోజులు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనానికి వచ్చిన వారికి స్వీట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, నారాలోకేష్ అభిమాన సంఘం నాయకులు నారాయణ, కదిరప్ప, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, కౌన్సిలర్లు గుడిపాటి అంజనేయులు, వై సుధాకర్, మాజీ కౌన్సిలర్లు ఆమ్లెట్‌మస్తాన్ యాదవ్, అంజి, హనమంతు, తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య అభిమానుల సంబరాలు



వినాయకసర్కిల్లో కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

రాయదుర్గం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డ ప్రకటించడంతో పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద ఆయన అభిమానులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తొలుత టపాసులు పేల్చారు. తర్వాత కేక్ కట్ చేశారు. స్వీట్లను పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ బాలకృష్ణకు మరెన్నో అవార్డులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అభిమానులు సత్యనారాయణ, సిద్ధప్ప, పసుపులేటి వెంకటేశులు, సిద్ధప్ప, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల రీవెరిఫికేషన్

యాడికి/ పుట్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగుల కోటా కింద పింఛన్లు పొందుతున్న వారిని గుర్తించేందుకు గాను మంగళవారం రీ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో మంచానికే పరిమితమైన దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు 58మంది ప్రతినెలా ఒక్కొక్కరు రూ.15వేలు చొప్పున పింఛన్ తీసుకుంటున్నారని అన్నారు. మండలకేంద్రంలో 33, వేములపాడులో 4, రాయలచెరువులో 4, పుప్పాలలో 3, నగరూరులో 5, లక్షుంపల్లిలో 3, కమలపాడులో 4, కోనుప్పలపాడులో 1, నిట్టూరులో 1 పింఛన్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్యబృందం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలిస్తారని తెలిపారు. అధికారులకు లబ్ధిదారులు సహకరించాలని ఎంపీడీఓ కోరారు. ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోతే వారి పింఛన్లను హోల్డ్‌లో పెడతారని ఆయన తెలిపారు.

పుట్లూరు: మండలంలో 35 పింఛన్లను ఈనెల 29వ తేదీన ప్రత్యేక తనిఖీ బృందం వెరిఫికేషన్ చేయనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ ప్రకటనలో తెలిపారు. అరకటవేములలో -2, ఎస్. వెంగన్నపల్లిలో -4, కడవకల్లులో -4, కోమటికుంట్లలో- 6, మడుగుపల్లిలో-2, మడ్డిపల్లిలో-1, పుట్లూరులో-3, శనగలగూడూరులో-5, సూరేపల్లిలో-6, తక్కళ్లపల్లిలో-1, ఎల్లుట్లలో- 1 పింఛన్లను వెరిఫికేషన్ చేయనున్నట్లు చెప్పారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు జామెట్రీ బాక్సులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హులచెర్ల ఉన్నత పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు సోమవారం ఉచితంగా జామెట్రీ బాక్సులను టీడీపీ నాయకుడు గోపులాపురం బసవరాజు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు బహుమతులు అందిస్తానని ప్రకటించారు. మొదటిస్థానం వచ్చిన వారికి రూ.25 వేలు, రెండో స్థానం వచ్చిన వారికి రూ.10 వేలు, మూడో స్థానం వచ్చిన వారికి రూ.ఐదువేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తానని పేర్కొన్నారు. హెచ్ఎం ఎర్రిస్వామి, ఉపాధ్యాయుడు సర్దానప్ప, టీడీపీ నాయకులు నగేష్‌రెడ్డి, గోపాల్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పేపర్ బుక్‌లెట్ల పంపిణీ

ఉరవకొండ: మండలంలోని అమిద్యాల, మోపిడి జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వారు మోడల్ పేపర్ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. 90మందికి వాటిని అందించారు. ట్రస్ట్‌సభ్యులు, హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్ర సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్లను తనిఖీచేశారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ వెంగళరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెళుగుప్ప, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కందుల్ని కొనుగోలు చేయనున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

కణేకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కణేకల్లు వీఆర్వో పవన్‌కుమార్ సోమవారం తిరుపతిలో రోడ్డుప్రమాదానికి గురయ్యారు. సొంత పని నిమిత్తం తిరుపతికి వెళ్లిన ఆయన్ను సోమవారం మధ్యాహ్నం ఓ వాహనం ఢీకొనడంతో తలకు గాయమైంది. స్థానికులు వెంటనే ఆసుపత్రికి చేర్పించి బంధువులకు సమాచారం అందించారు. తిరుపతిలోని బంధువులు ఆయన్ను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు.

రైల్వే ట్రాక్ సమీపంలో అగ్నిప్రమాదం

రాయదుర్గంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో రైల్వేట్రాక్ పక్కన సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. రైల్వే వారు ట్రాక్‌కు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయంలో వాటి వైర్లు రాసుకుని నిప్పురవ్వలు చెలరేగి పక్కనే ఉన్న చెత్తాచెదారం, ఎండుగడ్డిపై పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను ఆర్పారు. రైల్వేట్రాక్ ఇరువైపులా వ్యవసాయ పొలాలు ఉండడంతో రైతు లు ఆందోళన చెందారు. కాగా ఎటువంటి నష్టం వాటిల్లకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

అవినీతిపై విచారణకు ఆదేశం

విడపనకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గల వెలుగు సంఘాల్లో జరిగిన అవినీతిపై విచారించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏపీఎం కాలానాయక్ తెలిపారు. మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రంలోని 102 సంఘాల్లో, పాల్తూరులోని 150 సంఘాల్లో అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. విడపనకల్లులోని 96 సంఘాల్లో సీసీ సంతకాలు కానీ, ఏపీఎం సంతకాలు లేకుండా రుణాలు మంజూరు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి ఎక్కడ ఎంత అవినీతి జరిగిందనే వివరాలు సేకరిస్తామని ఏపీఎం తెలిపారు. విచారణకు దాదాపు 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

గుంతకల్లు టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారులు దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ మనోహర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆయన పలు దుకాణాల యాజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చోరీల నియంత్రణకు షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. టూటౌన్ సీఐ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గేట్స్‌లో హానర్ అవార్డుల ప్రదానం

గుత్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం గేట్స్ హానర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని జరిగింది. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది అకాడమిక్ పరీక్షల్లో 75నుంచి100శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ హానర్ అవార్డులను అందజేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ సారి కూడా బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు అవార్డులను అందజేశామన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఈ ఇంతియాజ్ బాష, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరయ్యేదెన్నడో?

● గోకులం షెడ్ల నిర్మాణం పూర్తయినా మంజూరు కాని బిల్లులు

● లబోదిబోమంటున్న లబ్ధిదారులు



బసంపల్లిలో నిర్మాణం పూర్తయిన మినీ గోకులం షెడ్డు

శెట్టూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు ములకలేడు, రంగయ్య పాలెం, కనుకూరు, పెరుగుపాలెం, అయ్యగార్లపల్లి, యాటకల్లు గ్రామాల్లో చాలా మంది రైతులు ప్రభుత్వం ఉపాధిహామీ కింద మంజూరు చేసిన మినీగోకులం షెడ్లు నిర్మించుకున్నారు. అయితే నెలలు గడుస్తున్నా వాటి బిల్లులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మొదటి విడతగా మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో 46 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అందులో 24 షెడ్ల నిర్మాణం పూర్తయి ప్రారంభించడం కూడా జరిగింది. అయితే బిల్లులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఉపాధి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన ప్రయోజనం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన షెడ్లకు బిల్లులు మంజూరుచేయాలని వారు కోరుతున్నారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం: జేసీపీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామనిమున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంజీవనగర్‌లోని బుగ్గయ్యకాంపౌండ్‌లో ఉన్న పార్కు వద్ద సోమవారం ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్కులను అభివృద్ధిచేసి అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణం కావాలంటే చుట్టుపక్కల ఏమి లేవన్నారు. అందుకే పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అభివృద్ధిచేసిన తర్వాత మహిళలకే వీటిని అప్పగిస్తామన్నారు. ఏమైనా పార్కుల్లో సమస్యలు ఉన్నట్లయితే మున్సిపల్ అధికారులకు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

పట్టణంలోని కృష్ణాపురం జీరోరోడ్డులో ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ అసోసియేషన్ 6వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కార్మికులంతా అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగేందుకు కష్టపడాలని తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి కోసం తనవంతుగా రూ. లక్ష విరాళం ప్రకటించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, అసోసియేషన్ సభ్యులు బాబా, హుస్సేన్‌బాషా, రంగనాథ బాబు, అనిల్, శ్రీధర్, నాగేంద్ర పాల్గొన్నారు.

అభయ ఫౌండేషన్ సేవలు అమోఘం: ఎమ్మెల్యే



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో అభయ ఫౌండేషన్ చేపడుతున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొనియాడారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన అభయ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ, చిన్నజీయర్ స్వామీజీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడిగిన వెంటనే అభయఫౌండేషన్ వారు కళ్యాణదుర్గం ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఆ ఫౌండేషన్ సేవలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో వుంటాయని పేర్కొన్నారు.

స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో స్కౌట్స్ విద్యార్థులు తేజ, అనిల్, వరుణ్, హనుమేష్, ఎల్లప్ప, యశ్వంత్‌లు కవాతులో మంచి ప్రదర్శన కనబరిచారని, దీంతో అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారని స్కౌట్స్ ఉపాధ్యాయుడు శ్రీవర్ధన్ తెలిపారు. స్కౌట్స్ విద్యార్థులను ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుట్టను చదును చేసి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ. సురేష్ డిమాండ్ చేశారు. గుట్టను సోమవారం ఆయన పలువురు నాయకులతో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కసాపురం గ్రామంలోని చెన్నప్ప కొట్టాల రోడ్ క్రాస్ వద్ద 424వ సర్వేనెంబర్‌లో ఉన్న ప్రభుత్వ గరుసు గుట్టను ఓ రైల్వే కాంట్రాక్టర్ తవ్వి ఎర్రమట్టిని తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్ వద్ద లూప్‌లైన్ రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం వాడుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు చెప్పారు. ఇంతజరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ కమిటీ సభ్యులు జిలాన్, నారాయణ, పీక్రావలి, భాషా, గోపి తదితరులు పాల్గొన్నారు.

తొండపాడు ఆలయ ఈఓగా రామాంజనేయులు

గుత్తిరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో గల బొలికొండ రంగనాథస్వామి ఆలయ ఈఓగా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతమునుపు ఈఓ నాదేంద్రుడు వ్యక్తిగత పనుల మీద కొద్దిరోజులు సెలవుపై వెళ్లారు. దీంతో తాడిపత్రిలో పని చేస్తున్న రామాంజనేయులుకు ఇక్కడి బాధ్యతలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దపప్పూరు, జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామం వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముచ్చుకోటకే చెందిన లక్ష్మన్న, డ్రైవర్ బాబాకు గాయాలయ్యాయి. వ్యక్తిగత పనుల నిమిత్తం కొండాపురం నుంచి ముచ్చుకోటకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయాలైన వారిని స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పుట్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి, 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. రామకృష్ణపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

శెట్టూరు/ కూడేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : శెట్టూరు మండలం పెరుగుపాలెం, తిప్పనపల్లి గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలు నిర్వహించి పలు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఏడీఏ నాగలింగేశ్వరరెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అలాగే కూడేరు మండలం జల్లిపల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం పశు వైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను టీడీపీ నాయకులు, పశువైద్య సిబ్బంది, రైతులు విడుదల చేశారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుత్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనగోలు కేంద్రాన్ని సోమవారం టీడీపీ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులు పండించిన కందిని ఈ కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7550మద్దతు ధర కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు ఎంకే చౌదరి, బద్రివలి, మార్కెట్ యార్డుమాజీ చైర్మన్ శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం